క్లుప్తంగా

ఆలయాల్లో అమావాస్య పూజలు



గాడుబావి ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

బేతంచెర్ల: శ్రావణ మాసం అమావాస్యను పురస్కరించుకుని పట్టణంలోని బైటిపేటలో వెలసిన గాడు బావి ఆంజనేయస్వామి, గౌరిపేట, పలక చింతమాను, కనుమ ఆంజనేయస్వామి ఆలయాల్లో సోమవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, సింధూర అర్చన, ఆకుపూజ, మహా మంగళహారతి ఇచ్చారు. అలాగే బనగానపల్లె రహదారిలోని పుట్ట పెద్దమ్మ ఆలయంలో నిర్వాహకుడు రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిగాయి. సిమెంట్ నగర్ గ్రామంలోని సుంకులా పరమేశ్వరి అమ్మవారికి ప్రత్యేక అలంకరణ, అర్చనలు చేశారు.

పంట నూర్పిడి యంత్రంలో పడి మహిళ దుర్మరణం

అవుకు: జూనూతల గ్రామంలో పంట నూర్పుడి యంత్రంలో పడి మహిళ మృతి చెందిన ఘటన సోమవారం చోటుచేసుకుంది. వివరాలు.. అనంతపురం జిల్లా యాడికి మండలం చందన గ్రామానికి చెందిన నారాయణమ్మ (52) అవుకు మండలం జూనూతల గ్రామంలోని కూతురు ఇంటికి పది రోజుల క్రితం వచ్చింది. వ్యవసాయ పనుల నిమిత్తం గ్రామంలో పనికి వెళ్లింది. మినుము పంట నూర్పిడి యంత్రం వద్ద ఉన్న ఆమె ప్రమాదవశాత్తూ నారాయణమ్మ యంత్రంలో పడిపోవడంతో అక్కడికక్కడే మృతి చెందింది.

లైంగిక దాడి నిందితుడిని శిక్షించాలి

కోవెలకుంట్ల: అవుకు మండలం కాశీపురం గ్రామంలో బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని కోవెలకుంట్ల శ్రీనివాస హైస్కూల్ కరస్పాండెంట్ లతా మంజుల కోరారు. సోమవారం స్థానిక పాఠశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ..ప్రభుదాస్ అనే వ్యక్తి తమ స్కూల్ బస్ డ్రైవర్‌గా పనిచేసేవాడని, అతని ప్రవర్తన సరిగా లేకపోవడంతో వారం క్రితమే తొలగించామని తెలిపారు. ఈ విషయాన్ని అవుకు పోలీసులకు రాత పూర్వకంగా తెలియజేశామన్నారు. కామంతో కళ్లు మూసుకుపోయి బాలికపై లైంగిక దాడికి పాల్పడిన నిందితుడికి కఠిన శిక్ష విధించాలని కోరారు

తుమ్మల చెరువుకు జలహారతి



జలహారతి ఇస్తున్న వేద పండితులు

డోన్ టౌన్: పంచభూతాల్లో ఒక్కటైన నీరుకు జల హారతి ఇవ్వడం హిందూ సంప్రదాయం అని శతవధాని గండ్లూరి దత్తాత్రేయశర్మ అన్నారు. గాయత్రి బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సోమవారం వెంకటాపురం తుమ్మల చెరువుకు జల హారతి ఇచ్చారు.సంఘం ఉపాధ్యక్షుడు క్లో శేషావలి శర్మ, పురోహితులు గంగాధరశాస్త్రి, భాస్కరశర్మ, చంద్రశేఖరశర్మ, సాయిప్రణీత్‌శర్మ, శకుంతలమ్మ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

డోన్ రూరల్: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొనడంతో ఇద్దరు గాయపడిన ఘటన మండల పరిధిలోని 44 జాతీయ రహదారి ఓబులాపురం వద్ద సోమవారం చోటుచేసుకుంది. అనంతపురం జిల్లా గుంతకల్లు మండలానికి చెందిన హరీష్, రామాంజిని ఓబులాపురం గ్రామంలోని బంధువుల ఇంటికి బైక్‌పై వెళుతున్నారు. మార్గమధ్యలోని ఓబులాపురం వద్ద కర్నూలు వైపు నుంచి వస్తున్న కారు ఢీకొంది. బైక్‌పై ఉన్న ఇద్దరు గాయపడ్డారు. వారిని డోన్ ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. దీనిపై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు. .

వాహన కార్మికుల నిరసన



ధర్నా చేస్తున్న యూనియన్ నాయకులు

డోన్ రూరల్: కేంద్రం తీసుకొచ్చిన జీఓ నంబర్175ను వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ ఆటో వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు అన్వర్ డిమాండ్ చేశారు. సోమవారం ఆటో, ట్రాక్టర్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులతో కలిసి పట్టణంలోని పాతబస్టాండ్ వద్ద నిరసన తెలిపారు. వాహనాలకు ఫిట్‌నెస్‌సర్టిఫికెట్ల జారీని ప్రైవేట్ సంస్థలకు అప్పగించడం సరికాదని ఆక్షేపించారు. బేతంచెర్ల, డోన్, ప్యాపిలి మండలాలకు చెందిన వాహనదారులు 110 కి.మీ దూరంలోని నంద్యాలకు వెళ్లాలంటే కష్టతరమని పేర్కొన్నారు.



డోన్: మంత్రి బుగ్గన స్వగృహంలో వైఎస్సార్ విగ్రహానికి నివాళి



బేతంచెర్లలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు



బేతంచెర్ల: బుగ్గానిపల్లె గ్రామంలో..



డోన్‌లో బైక్ ర్యాలీ

పేదల గుండెచప్పుడు.. వైఎస్సార్

మహానేత, దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి వర్ధంతిని సోమవారం వాడవాడలా నిర్వహించారు. డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, రాజన్న అభిమానులు ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన హయాంలో అమలు చేసిన సంక్షేమ పథకాలను గుర్తుచేసుకున్నారు. ఆయన దూరమై ఇన్నేళ్లు అయినా ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వేశారని నాయకులు పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం పనిచేస్తామన్నారు.



డోన్‌లో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

- డోన్, బనగానపల్లె నియోజకవర్గ వ్యాప్తంగా రాజన్న వర్ధంతి
- నివాళులర్పించిన వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు
- ఆయన పాలనను గుర్తు చేసుకుని భావోద్వేగం

బనగానపల్లె: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రజలకు దూరమై 15 ఏళ్లు పూర్తయినా ఆయన చేసిన పాలన, ప్రజలకు అందించిన సంక్షేమ పథకాలు అందరి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. వైఎస్సార్ వర్ధంతి సందర్భంగా సోమవారం బనగానపల్లె పెట్రోల్ బంక్ కూడలి వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, మైనార్టీలకు రిజర్వేషన్, 108 అంబులెన్స్, రైతులకు ఉచిత విద్యుత్, రుణమాఫీ, జలయజ్ఞం వంటి పథకాలతో అన్ని వర్గాల్లో చెరగని ముద్రక వేశారని తెలిపారు. ఆయన ఐదేళ్ల పాలనలో జనరంజక పాలన అందించారని గుర్తు చేసుకున్నారు. తండ్రి బాటలో తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాలతో సుపరిపాలన అందించారని తెలిపారు. అయితే ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన కొనసాగిస్తోందని దుయ్యబట్టారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధిని గాలికొదిలేసి వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు చేయడమే పనిగా పెట్టుకుందని మండిపడ్డారు. బీసీ జనార్థన్ రెడ్డి రోడ్లు భవనాల శాఖ మంత్రిగా ఉన్నా ఎక్కడి గుంతలు అక్కడే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు లక్ష్మీసుబ్బమ్మ, అవుకు, బనగానపల్లె వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు కాటసాని తిరుపాల్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ దీవెనమ్మ, నాయకులు సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, బండి బ్రహ్మానందరెడ్డి, కరీం, రామచంద్రారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, కాటసాని రామకృష్ణారెడ్డి, అబ్దుల్‌ఫయజ్, మహమ్మద్‌హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

గొప్ప దార్శనీకుడు వైఎస్సార్

డోన్: వైఎస్సార్ గొప్ప దార్శనీకుడని రాష్ట్ర మీట్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ శ్రీరాములు అన్నారు. మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్వగృహంలో మహాచిత్రపటానికి పార్టీ నాయకులతో కలిసి నివాళులర్పించారు. పేదల ఆర్థికాభివృద్ధికి ఎనలేని కృషి చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు బద్దల రాజ్‌కుమార్, మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుస్సేన్, వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు పోస్టుపసాద్, నాయకులు రాజవర్ధన్, దొరపల్లె చిరంజీవి, కురుకుంద హరి, మల్యాల శ్రీనివాసరెడ్డి, కౌన్సిలర్లు మహేశ్వరరెడ్డి, రైల్వే నాగేంద్ర, వెంకట్రాముడు, మిట్టా రవికుమార్, రమణ, కోఆప్షన్ సభ్యులు కుమ్మరి రాజు, పాతపేట రఫీ పాల్గొన్నారు. అలాగే స్థానిక వైఎస్సార్ సర్కిల్ వద్ద మహానేత విగ్రహానికి మండల ప్రజాపరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రిస్వామి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. నాయకులు ఎల్లేశ్వర్, వడ్డె రంగస్వామి, వంశీ, సిద్ద, ఆదాం, రాజ్‌కుమార్, గడ్డం సురేష్, నాగిరెడ్డి, మిట్టా రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: మండలంలోని ధర్మవరం, కోట్లవారి పల్లె గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు గొల్ల శ్రీనివాసులు, బోయ రంగనాయకులు, బోయ శ్రీరాములు, రమణ, పులింద్ర, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

డోన్ టౌన్: స్థానిక వెంకటాపురం సర్కిల్‌లోని వైఎస్సార్ విగ్రహానికి కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గార్లపాటి మద్దిలేటిస్వామి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నివాళులర్పించారు.

కోవెలకుంట్ల: మహానేత వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి కోవెలకుంట్ల మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ బీవీ నాగార్జునరెడ్డి, రైతు సంఘం అధ్యక్షుడు కానాల రవీంద్రనాథరెడ్డి, నాయకులు భీమిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, పోతం రాంమోహన్‌రెడ్డి, అమడాల భాస్కర్‌రెడ్డి, పాండురంగస్వామి దేవాలయ మాజీ ధర్మకర్త రాంభూపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. చరిత్ర ఉన్నంత వరకు రాజన్న గుర్తిండిపోతారని పేర్కొన్నారు. అలాగే మండలంలోని బిజనవేముల, వెలగటూరు, గుళ్లదూర్తి, కంపమల్ల, కలుగొట్ల, రేవనూరు, చిన్నకొప్పెర్ల, అమడాల, సౌదరదిన్నె, తదితర గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఎల్వీ సుధాకర్‌రెడ్డి, నాగార్జునరెడ్డి, లోకేశ్వరరెడ్డి, అబ్రహం, మాచిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, శంకరయ్య, ఆసం మధుసూదన్‌రెడ్డి,కామని మహేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, పార్టీ నాయకులు బాబుల్‌రెడ్డి, బుగ్గన చంద్రారెడ్డి, ముర్తుజావలి, ఖాజా, నాగరాజు పుష్పాంజలి ఘటించారు. వార్డు కౌన్సిలర్లు కోట్ల మధు, ఇబ్రహీం, నాయకులు రామచంద్రుడు, శేఖరయ్య, మురళీకృష్ణ పాల్గొన్నారు. అలాగే సిమెంట్‌నగర్ గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఓం శివ, కుమార్, యాకూబ్, జాకబ్, గిడ్డయ్య, శంకరయ్య, సర్పంచ్ రామచంద్రుడు పాల్గొన్నారు. బుగ్గానిపల్లెలో మాజీ ఎంపీటీసీ రంగస్వామి, నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు నివాళులర్పించారు.

ప్యాపిలి: దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పేద, బడుగు, బలహీనవర్గాల ఆశాజ్యోతి అని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పోదొడ్డి కృష్ణమూర్తి, సింగిల్ విండో అధ్యక్షుడు బోరెడ్డి రాము అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పించారు. నాయకులు కమతం భాస్కర్ రెడ్డి, రాజా మురళీకృష్ణ, బషీర్, పాండు, నిజాం పాల్గొన్నారు.

సంజామల: మండలంలో ఆకుమల్ల సొసైటీ బ్యాంక్ మాజీ చైర్మన్ గౌరిగారి నాగేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. నాయకులు ఉయ్యాలవాడ ఖాసీం భాషా, ఉప సర్పంచ్ హాజీపీరన్, ఉసేని, చాకలి మధు, వెంకటేశ్వర్ రెడ్డి, ధర్మారెడ్డి, మోహన్‌రెడ్డి పాల్గొన్నారు.



కోవెలకుంట్లలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రజల మదిలో చెరగని స్థానం

కొలిమిగుండ్ల: చరిత్రలో నిలిచిపోయే పథకాలు అమలు చేసి ప్రజల మదిలో చెరగని స్థానాన్ని సంపాదించుకున్న నాయకుడు వైఎస్సార్ అని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి అన్నారు. కొలిమిగుండ్ల పార్టీ కార్యాలయంలో కాటసాని ప్రసాదరెడ్డి, అంబటి గుర్విరెడ్డితో కలిసి వైఎస్సార్, ఎర్రబోతుల వెంకటరెడ్డి చిత్రపటాలకు నివాళులర్పించారు. మహానేత హయాంలో సాగునీటి ప్రాజెక్టులు చేపట్టి వ్యవసాయానికి జీవం పోశారని కొనియాడారు. ఆయన చేసిన మేలును ప్రజలు ఎన్నటికి మర్చిపోలేరన్నారు. భవిష్యత్‌లో పెట్నికోట రిజర్వాయర్‌ను సాధించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని తెలిపారు. బందార్లపల్లె క్రాస్ రోడ్డు సమీపంలోని వైఎస్సార్ విగ్రహం వద్ద పార్టీ నాయకులు యాతం శివరామిరెడ్డి, మహేశ్వరరెడ్డి, రామచంద్రుడు పూలమాలలు వేశారు.



కొలిమిగుండ్లలో వైఎస్సార్,ఎర్రబోతుల చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న జెడ్పీచైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



ప్యాపిలిలో నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



సంజామల: ఆకుమల్లలో..



బందార్లపల్లెలో..

పంటలో వర్షపునీరు తొలగించకుంటే నష్టం

కోవెలకుంట్ల: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాలతో మొక్కజొన్న పంటలో వర్షపునీరు చేరి తీవ్ర నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని మండల వ్యవసాయాధికారి నిరంజన్ తెలిపారు. సోమవారం మండలంలోని పలు గ్రామాల్లో మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అధిక వర్షాల కారణంగా పంటను చీడపీడలు ఆశించి నష్టపరుస్తాయన్నారు. సరైన యాజమాన్య పద్ధతులు పాటించి పంటను రక్షించుకోవాలని పేర్కొన్నారు. పొలంలో నిల్వ చేరిన నీటిని వీలైనంత త్వరగా బయటకు పంపాలన్నారు. ఎకరాకు 30 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్ ఎరువులను పైపాటుగా వేయాలని సూచించారు. కాండం తొలుచు పురుగు, ఆకు ఎండు తెగులు నివారణకు ఎకరాకు 400 మి.లీ ప్రొఫెనోఫాస్, 200 మి.లీ ప్రోఫికొనజోల్ మందులను పిచికారీ చేయాలని తెలిపారు. వర్షాలు తగ్గిన 3 నుంచి 4 రోజుల తర్వాత వరుసల మధ్య భాగాన్ని దున్నుకోవాలన్నారు. కోత దశలో ఉన్న పైరులో వెంటనే కోత పనులు చేపట్టాలని, తడిసిన కండెలను గచ్చుపై పల్చగా పేర్చి ఎండలో బాగా ఆరబెట్టి సాధ్యమైనంత త్వరగా నూర్పిడి చేయాలని వివరించారు.



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

విగ్రహాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



నిర్వాహకులకు సూచనలు చేస్తున్న సీఐ రమేష్‌బాబు

కొలిమిగుండ్ల: వినాయక చవితి సందర్భంగా విగ్రహాల ఏర్పాటుకు తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని సీఐ రమేష్‌బాబు సూచించారు. సోమవారం స్థానిక యూపీఎస్‌లో వివిధ గ్రామాలకు చెందిన నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విగ్రహాల ఏర్పాటుకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సింగిల్‌విండో పద్ధతి ద్వారా సులభంగా అనుమతి పొందవచ్చని చెప్పారు. ప్రతి విగ్రహం వద్ద ఐదుగురితో కమిటీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఏదైనా సమస్య జరిగితే వారే బాధ్యత తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విగ్రహాలు కొలువుదీర్చాక మహిళలు, యువతులు వస్తుంటారని.. వారితో అసభ్యకరంగా ప్రవర్తించినట్లు తెలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. డీజేలకు అనుమతి లేదని, హిజ్రాలను పిలిపించి డ్యాన్సులు చేయించినా.. నిమజ్జనం సమయంలో మద్యం సేవించి అల్లర్లకు పాల్పడినా తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు. అందరూ ప్రశాంతంగా ఉత్సవాలను జరుపుకోవాలని సూచించారు.

ప్రజల నమ్మకంతోనే అగ్రగామిగా ఎల్ఐసీ

డోన్ టౌన్: ఎల్ఐసీపై ప్రజలు నమ్మకం, విశ్వాసం ఉంచడం వల్లే బీమా రంగంలో అగ్రగామిగా వెలుగొందుతోందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రమోహన్, ఎల్ఐసీ బ్రాంచ్ మేనేజర్ రాముడు, అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసులు అన్నారు. జీవిత బీమా సంస్థ 68వ వసంతంలోకి అడుగుపెట్టడంతో సోమవారం స్థానిక కార్యాలయంలో వారోత్సవాలను జ్యోతి ప్రజ్వలన చేసి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశంలోనే కాకుండా ప్రపంచంలో బీమా రంగంలో ఎల్ఐసీ అగ్రగామి ప్రభుత్వరంగ సంస్థగా ప్రజల నమ్మకం చూరగొందని తెలిపారు. లక్షల కోట్ల ఆస్తులు కలిగి కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో పెట్టుబడులు పెడుతోందన్నారు. ప్రజా సంక్షేమంతో పాటు పాలసీదారులకు ఆర్థిక రక్షణ కల్పిస్తోందని చెప్పారు. దేశంలో బీమా రంగంలో ఎల్ఐసీ 68శాతం వాటా కలిగి అతి పెద్ద సంస్థగా రూపుదిద్దుకుందని కొనియాడారు. వారోత్సవాల్లో భాగంగా మంగళవారం వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు బ్రాంచ్ మేనేజర్ తెలిపారు. అనంతరం సీనియర్ ఉద్యోగులు, ఏజెంట్లు, పాలసీదారులను ఘనంగా సత్కరించారు.



68వ వార్షికోత్సవంలో మాట్లాడుతున్న డాక్టర్ చంద్రమోహన్

లింగనిర్ధారణ పరీక్షలు చేస్తే క్రిమినల్ కేసులు

డోన్ టౌన్: లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కేంద్రాల లైసెన్సులు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్డీఓ మహేశ్వరరెడ్డి అన్నారు. సోమవారం రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో భ్రూణ హత్యల నివారణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమాజంలో లింగ వివక్షను రూపుమాపడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. ఆడ పిల్లలపై చులకన భావంతో కడుపులో ఉండగానే చంపేయడం అమానుషమన్నారు. ఇప్పుడు మహిళలు పురుషులకు మించి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. గర్భ నిర్ధారణ పరీక్షలు చేసే స్కానింగ్ కేంద్రాలు కేవలం గర్భంలో ఉన్న శిశువు ఆరోగ్య పరిస్థితులను వివరించాలనే కానీ ఆడ,మగ అని తేల్చడం చట్ట రీత్యా నేరం అన్నారు. లింగ వివక్ష వల్ల స్త్రీ నిష్పత్తి తగ్గిపోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఎక్కడైనా లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు. డోన్ డీఎస్పీ శ్రీనివాసులు, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత, డాక్టర్లు రామకృష్ణ, షబ్బాస్ హుస్సేన్, సామాజిక కార్యకర్తలు మహ్మద్ రఫీ, ఏఈ నాగరాజు, న్యాయవాధి మధుసూదనరెడ్డి ఉల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆర్డీఓ మహేశ్వరరెడ్డి

వైభవంగా కృష్ణుడి గ్రామోత్సవం



కొలిమిగుండ్లలో స్వామివారి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు



ప్యాపిలి: పల్లకీ మోస్తున్న రైల్వే ఎస్పీ రాహుల్ మీనా

కొలిమిగుండ్ల: కృష్ణాష్టమి వేడుకల్లో భాగంగా త్రైత సిద్ధాంతం, ప్రబోధ సేవాసమితి ఆధ్వర్యంలో మీర్జాపురంలో వారం పాటు శ్రీకృష్ణుడి ప్రతిమను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చివరి రోజు సోమవారం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి మేళతాళాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. మహ్మద్ హుసేని నాయుడు, నరేంద్రకుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

ప్యాపిలి: మండలంలోని ఏనుగుమర్రి గ్రామంలో కృష్ణాష్టమి ముగింపు ఉత్సవాల్లో నిర్వహించిన పల్లకీ సేవలో గుంతకల్లు రైల్వే ఎస్పీ రాహుల్ మీనా, రాష్ట్ర గొర్రెల పెంపకందార్ల సంఘం అధ్యక్షుడు నాగేశ్వరరావు హాజరై పల్లకీ మోశారు. నిర్వాహకులు కృష్ణ, మల్లేశ్వరయ్య, అంజి, లక్ష్మీనారాయణ రెడ్డి, సుధాకర్, రమేశ్, సురేశ్, అంజి, శివ పాల్గొన్నారు.

మద్యం విక్రేత అరెస్ట్

కోవెలకుంట్ల: మండలంలోని రేవనూరు గ్రామంలో బెల్ట్‌షాపు ద్వారా మద్యం బాటిళ్ల విక్రయిస్తున్న వ్యక్తిని సోమవారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ భూపాలుడు తెలిపారు. గ్రామానికి చెందిన నరసింహుడు మద్యం బాటిళ్ల విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని 30 మద్యం బాటిళ్ల స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

కర్ణాటక మద్యం స్వాధీనం..వ్యక్తిపై కేసు

బేతంచెర్ల: మండల పరిధిలోని రహిమానుపురంలో కర్ణాటక మద్యం విక్రయిస్తున్న యాదవబోయిన శ్రీకాంత్‌ను అదుపులోకి తీసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ చంద్రశేఖరప్ప తెలిపారు. అతని వద్ద నుంచి 96 టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.